ఇన్చార్జి మంత్రికి ఘన స్వాగతం పలికిన డాక్టర్ లక్ష్మీ ప్రసాద్

విశాలాంధ్ర-రాయచోటి రూరల్ : జిల్లా ఇంఛార్జ్ మంత్రి రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు మౌళిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కి శనివారం రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్ నందు టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పూల బొకే అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

ఆదివారం 9 మార్చి, 2025 | 8 పేజీలు

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మహిళా పక్షపాతి
మహిళలు అన్ని రంగాలలో ధైర్యంగా ముందుకు రావాలి
మహిళల పట్ల ప్రతిఒక్కరు గౌరవంగా మెలగాలి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో రాష్ట్ర బిసి సంక్షేమం, జిల్లా ఇంఛార్జి మంత్రి ఎస్. సవిత

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర బిసి సంక్షేమం, జిల్లా ఇంఛార్జి మంత్రి ఎస్. సవిత అన్నారు. శనివారం స్థానిక సాయి శ్రీనివాస్ గార్డెన్స్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం అతి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి సవిత మాట్లాడుతూ స్త్రీలు ఎక్కడ గౌరవించబడుతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారు అని నమ్మిన సమాజం మనది. ఒక పురుషుడి విజయం వెనుక తల్లిలా, తోబుట్టువులా, భార్యలా...ఓ స్త్రీ మూర్తి ఎప్పుడూ ఉంటుందన్నారు. ఓ సమాజం ఉన్నతంగా ఉందన్నా...ఓ కుటుంబం మంచిగా ఉందన్నా...అందుకు కారణం స్త్రీమూర్తే అని తెలిపారు. మహిళలు వంట గదులకే పరిమితమవుతున్న వేళ...ఓ మహానీయుడు పుట్టుకొచ్చాడు..ఆయనే అన్న ఎన్టీఆర్..సమాజమే దేవాలయం...ప్రజలే దేవుళ్లు అంటూ...నినదించారన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన సాగిస్తున్న ప్రస్తుత మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళలకు అన్నింటా ప్రాధాన్యమిస్తున్నారు. విద్య, ఉద్యోగవకాశాల్లో 33.33 శాతం రిజర్వేషన్లు తీసుకొచ్చారు. 2014-19లో గాని, ప్రస్తుత పాలనలోగాని మహిళలకు ఆర్థిక లబ్ధి కలిగేలా పథకాలు రూపొందిస్తున్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక మహిళను వ్యాపారవేత్తగా చేయాలన్న లక్ష్యంతో ఎంఎస్ఎంఈ యూనిట్లు, స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది లక్షమంది మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దనున్నామన్నారు. లక్ష మందికి పైగా మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్నామన్నారు. అనంతపురం జిల్లా పెనుకొండ కు ఎమ్మెల్యే కావాలని మా అమ్మ కోరిక అని..ఎన్నో అడ్డంకులను అధికమించి నేడు మంత్రి స్థాయికి ఎదగగలిగానని మంత్రి అన్నారు. జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందడలో మనం 5వ స్థానంలో ఉన్నాం. గతంలో రూ.600 కోట్ల నుండి 650 కోట్లు రుణాలు ఇచ్చేవారం. అయితే ప్రస్తుతం బ్యాంకుల ద్వారా రూ1500 కోట్ల రుణాలు ఇస్తున్నామన్నారు. జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ఎంతోమంది మహిళా మహిణీయులు ఉన్నారని వారందరిని స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలన్నారు. జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ మాట్లాడుతూ మహిళలు మహిళ స్వాలంబన స్వయంగా సాధించుకోవాలని అన్నారు. కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి రెడ్డి మాట్లాడుతూ మహిళలు బహుముఖ ప్రజ్ఞాశాలులని అన్ని పనులు చేసుకోగలరని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 2027 విజన్ తో పని చేస్తూ మహిళా

సాధికారత కు అహర్నిశలు కృషి చేస్తూనారన్నారు. టిడిపి అధ్యక్షులు, పొలిట్ బ్యూరో శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ మహిళలు ధైర్యంగా ముందుకు వెళ్లి అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 983 స్వయం సహాయక సంఘాలలోని 9830 మంది సభ్యులకు "బ్యాంకు లింకేజీ " రుణాలు రూ. 105 కోట్ల 59 లక్షలు, 69 మంది ఎస్సి ఎస్ హెచ్ జి లబ్దిదారులకు ఎస్సి కార్పొరేషన్ సబ్సిడీతో కూడిన సెర్ఫ్ ఉన్నతి- వడ్డీలేని రుణాలు ప్రోత్సాహక నగదు బహుమతి రూ.2 లక్షలు మెగా చెక్కులను రాష్ట్ర బిసి సంక్షేమం, జిల్లా ఇంఛార్జి మంత్రి ఎస్. సవిత చేతుల మీదుగా లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్, డీఆర్డీఏ, మెప్మా పిడీలు శ్రీలక్ష్మి, ఆనంద్ నాయక్, కిరణ్ కుమార్, ఎస్సి కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, పలువురు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ముఖ్యమంత్రి లక్ష్యం

- ఇన్చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

విశాలాంధ్ర-రాయచోటి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళా సాధికారత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వల్లనే సాధ్యమైందని అన్నమయ్య జిల్లా ఇన్చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాయచోటి నగరంలోని నారాయణ ఫంక్షన్ హాల్ లో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు బీసీ జనార్దన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, టిడిపి నాయకులు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, జగన్మోహన్ రాజు, జయచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళలకు ఇచ్చిన ప్రాధాన్యతల వల్లే ఆంధ్రప్రదేశ్ లో మహిళా సాధికారత సాధ్యమైందని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన డ్వాక్రా గ్రూపుల వల్ల ఎంతోమంది మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించగలిగారన్నారు. కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రతి జిల్లాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుతున్నామన్నారు. మదనపల్లెకు చెందిన భవానిని స్ఫూర్తిగా తీసుకొని మహిళలందరూ ఆర్థిక, సామాజిక అభివృద్ధి పొందాలని సూచించారు. అన్నమయ్య జిల్లా జిడిపిలో 23వ ర్యాంకులో ఉన్నప్పటికీ అన్నమయ్య జిల్లాలోని మహిళలు డిజిటల్ కామర్స్ లో ఎంతో ముందు ఉన్నారని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ మహిళలు కేవలం కుటుంబ పోషణలోనే కాకుండా దేశ ఆర్థిక అభివృద్ధికి ఎంతో పాటు పడుతున్నారని వారి భద్రత చాలా ముఖ్యమని పేర్కొన్నారు. రాజంపేట టిడిపి పార్టీ నాయకుడు జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ మహిళలకు ఆస్తిలో హక్కు ఇచ్చే చట్టాన్ని ఎన్టీ రామారావు గారు తీసుకువచ్చి మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి చేశారన్నారు. అనంతరం జిల్లాలో వివిధ శాఖలకు చెందిన ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు, లక్షాధికారులుగా మారిన మహిళలకు శాలువా, మొమెంటులతో సత్కరించారు.

జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-రాయచోటి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా జిల్లా పోలీసు అధికారులు ఘనంగా మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్ రాయచోటి పట్టణం లోని శివాలయం కూడలి దగ్గర, మహిళలు, విద్యార్థినీలతో కలిసి, జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ర్యాలీ బంగ్లా కూడలి వద్దకు చేరింది, బంగ్లా కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. మహిళల ప్రాముఖ్యత, వారు సమాజానికి చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్)యం.వెంకటాద్రి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్, రాజా రమేష్, సీఐ, చంద్రశేఖర్, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ, రవిశంకర్ రెడ్డి, ట్రాఫిక్ సిఐ, విశ్వనాథరెడ్డి, పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది హోంగార్డులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సృష్టికి మూలం మహిళలు

సృష్టికి మూలం సహనానికి మారుపేరు మహిళలని సీనియర్ డాక్టర్ కోటేశ్వరి అన్నారు. రాయచోటి పట్టణం ఏరియా ఆసుపత్రి సమావేశ హాల్ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ యూనిట్ ఆదేశాల మేరకు నివారణ, నియంత్రణ సంస్థ పిసిఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రస్తుత సమాజంలో బాలికల పుట్టుక తగ్గిపోతుందని దీనిపై మహిళలు దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె పేర్కొన్నారు. అనంతరం మహిళా డాక్టర్లు కోటేశ్వరి, అర్చనలను పిసిఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది కేక్ కట్ చేసి దుశ్యాలవాలతో పుష్పగుచ్చం అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిసిఎస్ఎస్ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో బీ-ఫార్మసీ విద్యార్థిని మృతి

చెరువులో తేలియాడిన మృతదేహం

విశాలాంధ్ర-మదనపల్లె: అనుమానాస్పద స్థితిలో బీఫార్మసీ చదువుతున్న విద్యార్థిని మృతి చెందింది. శనివారం మదనపల్లె మండలం, సిటియం రోడ్డులోని తట్టివారిపల్లి చెరువులో మృతదేహం తేలియాడడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు తాలూకా సిఐ కళా వెంకటరమణ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వెలికి తీసి వివరాలు సేకరించారు. సీఐ కథనం మేరకు.. పీలేరు పట్టణం సమీపంలోని బాలంవారిపల్లికి చెందిన ఎంటి భాస్కర్ కుమార్తె ఎంటి పూజిత (24) మదనపల్లె మండలం, గంగన్నవారిపల్లె వద్ద ఉన్న కృష్ణ చైతన్య నర్సింగ్ కళాశాల నందు బీఫార్మసీ మూడవ సంవత్సరం చదువుతోంది. ఈ విద్యార్థిని మదనపల్లె పట్టణంలోని ప్రశాంత్ నగర్ లోని బాలాజీ పీజీ హాస్టల్లో ఉంటూ రోజు కళాశాలకు వెళ్లి వచ్చేది. ఈ క్రమంలో ఏం జరిగిందో ఏమో కానీ శనివారం చెరువులో మృతదేహమై కనబడింది. పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బీఫార్మసీ చదువుతున్న విద్యార్థిని మృతి వెనుక ఎన్నో అనుమానాలు తలెత్తుతున్నాయి. ఎవరైనా హత్య చేసి పడేశారా లేక ఆత్మహత్య చేసుకుందా అన్నది పోలీసు విచారణలో తేలాల్సి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళా దినోత్సవం సందర్భంగా అవగాహన సమావేశం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నాడు పట్టణంలోని వైఎంఆర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అవగాహన సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో ప్రముఖ గైనకాలజిస్ట్ వల్లంకొండు అనుష పాల్గొని మాట్లాడుతూ విద్య, వైజ్ఞానిక, సామాజిక రంగాలలో మహిళలంతా మరింత చైతన్యవంతులై ముందుకు రావాలని, తద్వారా దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. అన్ని రంగాలలో మగవారికి తీసిపోకుండా ముందు ఉండాలన్నారు. అలాగే మహిళలు ముఖ్యంగా వారి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. వైద్యాధికారి నల్లబల్లి హిమబిందు మాట్లాడుతూ మహిళల పట్ల చిన్న చూపు చూడక సమాజంలో ఆడ మగ సమానం అన్నారు. మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారన్నారు. ఎస్ఐఆర్డి సొసైటీ ప్రెసిడెంట్ ఎంవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ పీసీపీఎన్డీ యాక్ట్ గురించి అవగాహన కల్పించారు. పుట్టే బిడ్డ ఆడ, మగ అని అడగడం చట్టరీత్యా నేరం అన్నారు. అనంతరం డాక్టర్లను ఎస్ఐఆర్డీఎస్ ద్వారా మెమెంటో ద్వారా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి ఒంటెద్దు చెన్నమ్మ, సభ్యులు రమణమ్మ, గంగభవాని మరియు వార్డ్ హెల్త్ సెక్రటరీలు, ఆశా తదితరులు పాల్గొన్నారు.

మిట్స్ లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్, మదనపల్లె నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కల్పన మాట్లాడుతూ సృష్టికి మూలం మహిళ అని,మహిళ అనుకుంటే ఎంత పని అయిన, ఏ పని అయిన సాధిస్తుంది అని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా మహిళలంతా శాంతియుతంగా జీవించేందుకు చర్యలు తీసుకోవడానికి ఐక్యరాజ్య సమితి కట్టుబడి ఉందని ప్రకటించింది. మహిళలు అన్ని రంగాలలో పోటీ పడుతూ విజయం సాధిస్తున్నారు అని తెలిపారు. ఆమె మాట్లాడుతూ వివక్ష వేధింపులు, సాధింపులున్నా, అవకాశాలు రాకపోయినా, అవమానాలు ఎదు రైనా మహిళలు వాటిని ధైర్యంగా ఎదు ర్కొని ముందుకు సాగాలన్నారు. స్త్రీ సమానత్వం, సాధికారతే సమాజ ప్రగతికి మూలమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత సెల్(కో ఆర్డినేటర్ డాక్టర్ షణ్ముగ ప్రియా మాట్లాడుతూ ఇంటాబయట మహిళలు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు సమాజంలో మహిళను గౌరవించడం, సమానత్వం, ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు తగిన స్వేచ్ఛా స్వాతంత్రాలు కల్పిస్తే ప్రతిరోజు మహిళ దినోత్సవమే అవుతుందన్నారు. ఈ సందర్భంగా మహిళలకు నిర్వహించిన కార్యక్రమాలలో బహుమతులను అందజేశారు.

మహిళల హక్కుల కోసం పిడికిలి బిగించాలి

ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం 1909,1910 మధ్యకాలంలో తమ ఓటు హక్కు కోసం, సమానత్వం కోసం, సామాజిక న్యాయం కోసం పోరాడి సాధించుకున్న రోజే మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం, ఆనాటి స్మృతులను గుర్తుచేసుకొని ఇంకను నీకు రావలసిన హక్కులకై పిడికిల్లను బిగించాల్సిన రోజని, నేటి నుంచి మీ హక్కుల కోసం, నీ విలువల కోసం, రక్షణ కోసం, పోరు బాటపట్టాలని గుర్తుచేసే రోజే అంతర్జాతీయ మహిళా దినోత్సవం అని, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి, అన్నారు.శనివారం కడప నెహ్రూ పార్కు నందు రాయలసీమ మహిళా సంఘం ఆధ్వర్యంలో, తస్లిం అధ్యక్షతన నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ జనాభాలో సగభాగమైన మహిళలకు నేటికీ కూడా సమానత్వం లేదని, మహిళలపై చిన్న చూపు చూస్తు వారిని వంటింటి కుందేలు గానే చూస్తున్నారని, మహిళలు వారి అవసరాలను తీర్చే వస్తువుగానే చూస్తున్నారని, అందుచేతనే వారిపై దాడులు, లైంగిక వేధింపులు, అవమానాలు, హత్యలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. .కుటుంబాలలో మహిళలు చాకిరికి ఎక్కువగా గురవుతున్నారని, ఇంటి పనులను ఇంటిల్లిపాది అందరూ కలసి మెలసి పంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, మొదటగా ఇంట్లో ఉన్న మహిళలను కుటుంబ సభ్యులందరూ సమానత్వంతో చూడాలని ఆయన సూచించారు. భవిష్యత్ కాలం అంతా మహిళల కాలమేనని, వారి హక్కుల కోసం విలువల కోసం జరిగే పోరాటానికి నాయకత్వం వహించేది మహిళలేనని, ప్రతి ఒక్కరూ ఓ ఝాన్సీ లక్ష్మీబాయిల, రుద్రమదేవిలా పోరాటాలకు నడుము బిగించాలని ఆయన కోరారు. న్యాయ సేవ విభాగానికి చెందిన పర్వీన్ మాట్లాడుతూ, మహిళలకు చట్టం గురించి అవగాహన తక్కువగా ఉండడం చేతనే ఎక్కువగా నష్టపోతున్నారని, న్యాయ సేవలను వినియోగించుకోవాలని, తెలిపారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కేక్ ను కట్ చేసి అందరికీ మంచి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో, రాయలసీమ మహిళా సంఘం సభ్యులు లక్ష్మీదేవి, చాంద్ బేగం, కరిమున్, పర్వీన్, శోభారాణి, నీలమ్మ, మౌనిక, ఆర్ సి పి నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్, చాపల సుబ్బరాయుడు, విజయ్ కుమార్, ప్రతాప్ రెడ్డి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సన్మానం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వాసవి క్లబ్ సిరిపురం ప్రొద్దుటూరు ప్రెసిడెంట్ గుండా పద్మనాభయ్య ఆధ్వర్యంలో మరియు డిస్టిక్ క్యాబినేట్ సెక్రటరీ అనుమల వేణుగోపాల్ మరియు మహిళా సంఘాల ఆధ్వర్యంలో వికసిత ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, అధ్యక్షురాలు అయిన శూలం లక్ష్మీదేవి, స్నేహ శ్రీ వాలంటరీ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ దేవరశెట్టి మణిశయన, వాసవి క్లబ్ సిరిపురం రీజనల్ చైర్పర్సన్ కేతేపల్లి. సుష్మాలను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారి వారి ఇంటికి వెళ్లి చీర, శాలువా, పూలమాలలతో ఘణంగా సన్మానించారు. ఈ సంధర్భంగా వారికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్య క్రమంలో వాసవి క్లబ్ డిస్టిక్ క్యాబినేట్ సెక్రటరీ అనుముల వేణుగోపాల్, ట్రెజరర్ జయం.సురేష్ బాబు, గోపాల్, పచ్చిపులుసు, నరసింహారావు, మహిళా సభ్యులు రాజా, వరలక్ష్మి, నళిని, పద్మ, కేతేపల్లి బాబు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని యువతకు చేసిన మోసంపై నిరసన

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని యువతకు చేసిన మోసం పై నిరసన తెలిపేందుకు ఈనెల 12వ తేదిన జరిగే యువత పోరుకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం కడప నగరంలోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు నగర మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డితో కలిసి మాట్లాడారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలని చెప్పి ఇప్పటికీ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. మహిళలకి పెద్ద పీట వేసిన ఘనత వైఎస్ జగన్‌ది కాగా, ప్రస్తుతం రాష్ట్రంలో మహిళలకు పూర్తి స్థాయిలో అన్యాయం జరుగుతోందన్నారు. ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు పెట్టడమే లక్ష్యంగా పాలకులు పనిచేస్తున్నారని తెలిపారు. ఈనెల 12వ తేదీనే పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, బంగారు నాగయ్య యాదవ్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దేవి రెడ్డి ఆదిత్య, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు గురు సాయి దత్త, జిల్లా అధికార ప్రతినిధి జయచంద్ర రెడ్డి, నగర విద్యార్థి విభాగం అధ్యక్షుడు శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య కోర్సుల ఎంపికలో విద్యార్థులను ప్రోత్సహించాలి

ఉన్నత విద్యా మండలి అకడమిక్ ఆఫీసర్ శ్రీరంగం మ్యాథ్యు

విశాలాంధ్ర-మదనపల్లె : నైపుణ్య కోర్సులను ఎంపిక చేసుకునే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలని మండలి అకడమిక్ ఆఫీసర్ శ్రీరంగం మ్యాథ్యూ అన్నారు. స్థానిక శ్రీ జ్ఞానాంబికా డిగ్రీ కళాశాలలో రెండవ రోజైన శనివారం నైపుణ్యకోర్సుల వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉన్నత విద్యామండలి అకడమిక్ ఆఫీసర్ శ్రీరంగం మాథ్యూ మాట్లాడుతూ విద్యార్థులకు డిజిటల్ సాధనాలు ఉపయోగించి పాఠాలు బోధించాలని తెలియచేశారు. వీలైనంతవరకు విద్యార్థుల నుండి సమాధానాలను వెలికి తీసే ప్రయత్నం చెయ్యాలి. వారి ప్రమేయాన్ని కూడా అందులో చొప్పించి వారి ద్వారానే సమాధానాలు రాబట్టేలా అలవాటు చేయడం చాలా ముఖ్యమని సూచించారు. ప్రత్యేకంగా పరిశోధనలు, వృత్తి సంస్థలు ఇంటర్న్‌షిప్ మొదలైన నైపుణ్య కోర్సులకు ప్రాముఖ్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమం అనంతరం శ్రీరంగం మాథ్యూ ను కరెస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్ శాలువా తో సత్కరించారు. ఈ వర్క్ షాప్ లో కళాశాల కరెస్పాండెంట్ గురు ప్రసాద్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత ఆశయాలతో ముందుకెళ్లాలి

విశాలాంధ్ర-నందలూరు : విద్యార్థులు ఉన్నత ఆశయాలతో ముందుకెళ్లాలని రిమ్స్ డాక్టర్ సృజన, గైనకాలజిస్ట్ కామేశ్వరమ్మలు పేర్కొన్నారు. గొబ్బిళ్ళ అక్షర స్కూల్ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీరు ముఖ్య అతిథులుగా పాల్గొని జాతీయస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన లక్ష్మీ చైతన్య, షేక్ జైనబ్‌లను అభినందించారు. మొట్టమొదటిసారిగా స్కూల్ నందు బాలికల, మహిళా ఉపాధ్యాయుల కోసం షీ రూమ్స్ ప్రారంభించడం జరిగింది. మహిళా దినోత్సవం నాడు ఇంత గొప్ప కార్యక్రమాన్ని ప్రారంభిం చినందుకు సంతోషిస్తూ స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం విద్యార్థులకు విలువైన సలహాలు, సూచనలు అందించారు. అనంతరం స్కూల్ యాజమాన్యం గొబ్బిళ్ళ త్రినాథ్, గొబ్బిళ్ళ శ్రీనాథ్, ఉపాధ్యాయులు డాక్టర్ కామే శ్వరమ్మ, డాక్టర్ సృజన లను శాలువాతో సత్కరించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

రోడ్లు, రహదారులపై పశువుల సంచారం

ఇబ్బందుల్లో వాహనదారులు, పాదాచారులు -పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - బ్రహ్మంగారి మఠం : టౌన్ పరిధిలోనే రోడ్ల పై పశువులు సంచరిస్తూ పాదచారులను వాహనదారులను తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్నాయి. కొంతమంది పశువుల యాజమాన్యాలు వాటిని వదిలేయడంతొ రోడ్లపైనే సేద తీరుతున్నాయి. బ్రహ్మంగారి ఆలయ పురవీధుల్లో తిరుగుతూ వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తూ రాత్రివేళ సమయంలో రోడ్లపైనే నిద్రించడం మూగజీవుల తోపులాటలో ప్రజలు భక్తులు వాహనదారులకు కూడా ఇబ్బందులుగా మారుతూ భక్తులు కూడా తోపులాట్ల కారణంగా చిన్నచిన్న గాయాలై హాస్పిటల్ పాలయ్యారు. నిత్యం వివిధ రాష్ట్రాల నాలుమూల నుండి భక్తులు వాహనాలలో వస్తుంటారు. రోడ్లపై అడ్డంగా ఆవులు ఉండడంతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. బైక్‌లలో వెళ్లే వారికి కూడా ఆటంకాలు కల్పిస్తూ వాహనదారులు బైకులు పార్కింగ్ చేసిన తోపులాటలో వాహనాలు కూడా డ్యామేజ్ అయి అవస్థలు పడుతున్నారు. బైక్ బ్యాగులల్లో ఉన్న వస్తువులను లాగివేయడం, బైకులు కూడా కిందపడి డ్యామేజిల్ అవుతున్నాయి. వచ్చే భక్తులు కూడా వాహనాలకు అడ్డంగా నిలబడి ట్రాఫిక్ సమస్యలు చేస్తున్నాయి. నిత్యం రోడ్లపైనే పశువులు ఉండడం రాత్రి సమయంలో రోడ్లపైనే అడ్డంగా ఉండడం వేగంగా వస్తున్న వాహనాల్లో ఢీకొని చిన్నచిన్న స్వల్ప గాయాలు అవుతున్నాయని పశువుల యాజమాన్యం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలకు ఇబ్బంది కలగకుండా పశువుల యాజమాన్యాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు, భక్తులు కోరుతున్నారు. వీటితోపాటు కోతులు లగేజీలను లాక్కెళ్ళడం ఆలయ పరిధిలో పవిత్రమైన పూజ సామాగ్రి తీసుకొని వెళుతుండగా పూలు పళ్ళు వంటి చూసిన కోతులు లాగేస్తున్నాయని భక్తులకు ఇబ్బందిగా మారుతున్నాయి. పురవీధుల్లో చెత్తాచెదారం రోడ్ల పైన వేయడంతోనే అపరిశుభ్రం చేస్తున్నాయని యాజమాన్యాలు డస్ట్ బిన్‌లు ఏర్పాట్లు చేసుకొని దేవస్థానం ముందు ఇచ్చే చెత్త వాహనంపై వేయాలని ఎంతో పవిత్రమైన పుణ్యక్షేత్రానికి భక్తులు దర్శించుకునేందుకు రావడంతో రోడ్లపై చెత్త చెదారం ఉండడంతో కోతులు పందులు మూగజీవాలు ఇబ్బందిగా మారుస్తున్నాయి. సమస్యలు అధికారులు పరిష్కరించే విధంగా చూడాలని భక్తులు ఆశిస్తున్నారు.

క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలి

విశాలాంధ్ర- నందలూరు : క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, టిడిపి మండల క్లస్టర్ ఇంచార్జ్ పసుపులేటి ప్రవీణ్ కుమార్‌లు పేర్కొన్నారు. ఆడపూర్ లో వెలిసిన శ్రీ మంచాలమ్మ జాతర సందర్భంగా తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు సహకారంతో నిర్వహిస్తున్న టోర్నమెంటును శనివారం వీరు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించడంలో జగన్మోహన్ రాజు ముందుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లి, పాటూరు గ్రామ టిడిపి అధ్యక్షులు గంధం గంగాధర్, ముమ్మడిశెట్టి రమేష్ క్రికెట్ టోర్నమెంట్ కార్య నిర్వాహకులు రాజా, రిషి, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి : ఎవిఆర్ చైర్మన్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఏవిఆర్ విద్యా సంస్థల చైర్మన్ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం ఎస్ ఏ టి పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన వారిని అభినందిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య విజ్ఞానాన్ని పెంచుతుందని, పోటీ పరీక్షలు రాయడం ద్వారా విద్యార్థుల సామర్థ్యం బయటపడుతుందని పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. బహుమతులు ప్రదానం చేశారు.కార్యక్రమంలో డైరెక్టర్ వీర కుమారి, సీఈవో ఏ ఎల్ వివేకానంద, పల్లవి, ప్రిన్సిపాల్ ముని చంద్ర, నరసింహులు, క్యాంపస్ ఇన్చార్జి బాబా ఫక్రుద్దీన్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర - సుండుపల్లి : పోలీస్ స్టేషన్ లో మహిళలకు పోలీస్ స్టేషన్ రికార్డ్స్,పోలీసుల విధులు గురించి అవగాహన కల్పించడం జరిగినది అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు,అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వెంకటాద్రి గారి ఆదేశాల మేరకు రాయచోటి డిఎస్పి శ్రీ ఎం ఆర్ కృష్ణమోహన్ మరియు రాయచోటి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ వరప్రసాద్ సూచనల మేరకు మార్చి 8 వ తారీకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సుండుపల్లి పోలీస్ స్టేషన్ లో రికార్డులు విధులు గురించి తెలియజేసారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 20 కేసులు పరిష్కారం

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : జూనియర్ సివిల్ కోర్టు ప్రాంగణంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో రైల్వే కోడూరు మండలంలో 20 కేసులు పరిష్కారం అయ్యాయని కోడూరు అర్బన్ ఎస్ఐ గొంది నవీన్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీమార్గమే రాజమార్గం అన్నారు.జాతీయ లోక్ అదాలత్ లో ఇచ్చే తీర్పు అంతిమ తీర్పు అన్నారు. ఇరు వర్గాల వారికి సత్వర న్యాయం అందుతుందన్నారు. నేను మా హెడ్ కానిస్టేబుళ్లు పుష్పరాజ్,అబ్దుల్ ముజీర్,మరియు పోలీస్ సిబ్బంది అందరం సమన్వయంతో పనిచేసి ఇరు వర్గాలను పిలిపించి ఒప్పించి జాతీయ లోక్ అదాలత్ లో 20 కేసులు పరిష్కరించామన్నారు. కేసులు పరిష్కారం అయితే కక్ష్య దారులకు డబ్బులు ఆదాతో పాటు కోర్టుల చుట్టూ తిరిగాల్సిన పని లేకుండా రాజీ పూర్వకంగా కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు.

ఆవోప సంఘ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర- పులివెందుల :పులివెందుల పట్టణంలో అమ్మవా రి శాల నందు వాసవి క్లబ్, వనిత క్లబ్, ఆవోప సంఘం ఆధ్వర్యంలో 75 సంవత్సరాలు వయసు పూర్తి చేసుకున్న మహిళా మణులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా పాదపూజ మరియు సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మహిళా దినోత్సవం నాడు పెద్దవారైన మహిళా మణులకు సన్మాన కార్యక్రమం జరిపించడం మాకు ఎంతో ఆనందదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి మరియు వనిత క్లబ్ అధ్యక్షురాలు శ్రీమతి మేడ సుబ్బరత్నమ్మ మరియు వాసవి క్లబ్ అధ్యక్షులు రొట్టెల వినోద్ కుమార్ , ఆవోపా సంఘం అధ్యక్షులు మేడం దినేష్ కుమార్, ఆవోపా స్టేట్ వైస్ ప్రెసిడెంట్ మేడ సాయి బాబా,వాసవి క్లబ్ జోన్ చైర్ పర్సన్ సగళా మహేంద్ర బాబు, మహిళా మండలి మరియు వనిత క్లబ్ సభ్యులు, వాసవి క్లబ్ సభ్యులు, ఆవోపా సంఘం సభ్యులు పాల్గొన్నారు. వాసవి క్లబ్ సెక్రటరీ మిట్ట మహేశ్వర గుప్తా తెలిపారు.

సమాజాభివృద్ధిలో మహిళలు కీలకం:ఎంపిపి

విశాలాంధ్ర-చెన్నూరు : సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, కల్లూరి విజయభాస్కర్ రెడ్డి, ఎంపీడీవో మోహన్ రావులు అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక గ్రామపంచాయతీ ఆవరణంలో సర్పంచ్ సిద్ది గారి వెంకటసుబ్బయ్య(కళ్యాణ్) అధ్యక్షతన మహిళలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వారు ముఖ్యఅతిథిలుగా పాల్గొన్నారు. ప్రతి మహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆయన తెలిపారు. అనంతరం మహిళా పారిశుద్ధ్య కార్మికులను ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి సురేష్ బాబు, గ్రామ పంచాయతీ కార్యదర్శి శివకుమార్ రెడ్డి, ఏపిఎం వెంకటేష్, మహిళా అధ్యక్షురాలు అరుణమ్మ, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది, పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఘన్నంగా మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - ముద్దనూరు : అంతర్ జాతీయ మహిళా దినోత్సవం సందర్భణగా స్థానిక ముద్దనూరులో ఘనంగా నిరవహించారు. దీనిలో భాగంగానే మహిళా దినోత్సవం పురస్కరించుకొని స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బోనం సరళను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో సి.ఐ దస్తగిరి ,ఎస్.ఐ మైనుద్దీన్ లు మహిళా పోలీసులతో కేకు కట్ చేయించి వారికీ శుభాకాంక్షాలు తెలిపారు . కాగా మండల ఉత్తమ అంగన్వాడి టీచర్‌గ ప్రభావతి కడపలో పి.డి చేతులమీదుగా ప్రశంస పత్రం అందుకున్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : పోరుమామిళ్ల ఎస్ఐ ఆర్.వి. కొండారెడ్డి ఆదేశాల మేరకు పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్ సిబ్బంది మహిళా దినోత్సవం సందర్భంగా కస్తురిభా స్కూల్ నందు విద్యార్థినులకు కేకులు, మిఠాయిలు పంచి ఉమెన్ సేఫ్టీ, ఉమెన్ ఎంపవర్మెంట్ మరియు చట్టం మీద అవగాహన ఇవ్వడమైనది. అలాగే మహిళా దినోత్సవం సందర్భంగా పోరుమామిళ్ల ఎస్ఐ ఆర్.వి. కొండారెడ్డి పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్ మహిళా సిబ్బంది అయిన ఎం.మీనాక్షిని సత్కరించారు.

సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం

సిడిపిఓ టిపి సౌభాగ్యమ్మ

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం అని సిడిపిఓ టిపి సౌభాగ్యమ్మ పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం పైన సమావేశ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళ స్వశక్తితో సాధికారత, సమానత్వం సాధిస్తూ అన్ని రంగాలలో ఉనికిని చాటుకుందన్నారు. జెడ్పిటిసి పాలెంకోట రత్నమ్మ మాట్లాడుతూ పిల్లలను తీర్చి దిద్దడంలో మహిళల పాత్ర కీలకం అన్నారు.ప్రభుత్వం మహిళలకు ఎక్కువ ప్రోత్సాహం కల్పించాలని కోరారు. సిడిపిఓ టిపి సౌభాగ్యమ్మ, ఎసిడిపిఓ టి సరళాదేవి మహిళలకు విలువైన బహుమతులు ప్రదానం చేశారు. శ్రీసాయి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ముత్యాల పెంచలయ్య అద్వర్యంలో, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో గుంతకల్ రైల్వే డివిజన్ బోర్డు సభ్యులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి అద్వర్యంలో మహిళలకు శాలువా కప్పి పూలమాలవేసి ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్‌లు, స్టాఫ్, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

విశాలాంధ్ర- రాయచోటి రూరల్ : రాయచోటి టౌన్ భానుహరి రెసిడెన్సిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ..తల్లిగా, భార్యగా, చెల్లిగా, కుమార్తెగా, ఏ రూపంలో అయినా కుటుంబానికి మీరు చేసే త్యాగాలు అమూల్యం అన్నారు. రాయచోటి చిరంజీవి యువత అధ్యక్షులు చిన్నారి జయరాం, రాయచోటి జనసేన యూత్ లీడర్ బుల్లెట్ విజయ్, జనసేన పగడాల రాజేష్, నిమ్మనపల్లె పవన్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, గురిగింజ కుంట శివకుమార్ నాయుడు,జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లూరు సునీతమ్మ,లక్ష్మమ్మ, సింధు, చాగలమరి లావణ్య, బండ్రే నారాయణమ్మ,తదితరులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర- పీలేరు : కలికిరి ప్రాణాపాయం, అనారోగ్యం ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద దరఖాస్తు చేసుకున్న 23 మందికి చెక్కులు పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పంపిణి చేశారు. శనివారం నగిరిపల్లిలో పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, గుర్రం కొండ, కలకడ మండలాలకు చెందిన బాధితులకు సీఎం సహాయనిధి కింద రూ. 31.లక్షల 24.వేల 570 వచ్చిన చెక్కులు పంపిణీ చేశారు.ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో బడుగు బలహీన వర్గాలకు పూర్తి భరోసా కల్పి స్తూ, ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహాయ నిధి కింద చికిత్స కొరకు తగిన ఆర్థిక సహాయం అందజేసి ఆదుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎందరో నిరుపేదలకు ఆర్థికంగా ఆదుకుంటూ ప్రాణాలు కాపాడుతున్నారని ఆయన అన్నారు.ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ కింద చెక్కులు తీసుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

విశాలాంధ్ర- మదనపల్లె : వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ వాల్మీకి బోయ సంఘాలు గత 56 ఏళ్లుగా వివిధ రకాలుగా పోరాటాలు సాగిస్తున్నారని వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి అధ్యక్షులు పొదల నరసింహులు అన్నారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాత్రం వాల్మీకులను మభ్యపెడుతూ గద్దెనెక్కిన తర్వాత ఇచ్చిన హామీని పక్కన పెడుతున్నారని దుయ్యబట్టారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి వాల్మీకి సమస్యలపై గళ మెత్తడం, వాల్మీకులను ఎస్టీలో చేర్చాలని మాట్లాడడం హర్షనీయమన్నారు . ఇప్పటికైనా రాజకీయ నాయకులు వాల్మీకులకు ఎస్టీ జాబితాను పునరుద్ధరించే విషయమై న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమ కార్యచరణ రూపొందించి ప్రజాక్షేత్రంలోకి వస్తామని, ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వాల్మీకి బోయలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి :డాక్టర్.చంద్రశేఖర్

విశాలాంధ్ర- పీలేరు : మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు, వారికీ రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని తొడ్పాటు అందించాలని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అయన ప్రముఖ వైద్యులు నాగవేణి, శ్రీలత, నర్సులు, సిబ్బందిచే ఆసుపత్రి ప్రాంగణంలో చెట్లను నాటించారు. ఈ సందర్బంగా అయన మాటలాడుతూ చెట్టు ప్రగతికీ మెట్టు ఎలాంటిదో మహిళలు కూడా అన్ని రంగాలల్లో ముందువుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిస్మిల్లా ఆటో యూనియన్ అధ్యక్షులు బోదేశ పాల్గొన్నారు.

మహిళామణులకు ఘన సన్మానం

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లిలో శనివారం మహిళా మణులకు ఘన సన్మానం లభించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు శివ మునెమ్మ, ఐసిడిఎస్ సూపర్ వైజర్ స్వర్ణ లతలను సత్కరించారు.ఈ సందర్భంగా మాజీ రాజ్యసభ సభ్యులు తులసిరెడ్డి మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక,సామాజిక,రాజకీయ సాధికారిత సాధించడమే అంతర్జాతీయ మహిళా దినోత్సవం లక్ష్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటినుండీ మహిళా సాధికారిత కోసం కృషి చేస్తూ ఉందని, అనీబి సెంట్, సరోజినీ నాయుడు, ఇందిరా గాంధీ, సోనియా గాందీ అధ్యక్షులయ్యారు. ప్రతిభా పాటిల్ రాష్ట్ర పతి, ఇందిరా గాంధీ ప్రధాన మంత్రి,శ్రీమతి మీరా కుమార్ లోక్ సభ స్పీకర్ అయ్యారన్నారు.

కోరం లేక ఒంటిమిట్ట మండల సర్వసభ్య సమావేశం వాయిదా

విశాలాంధ్ర - ఒంటిమిట్ట : కోరం లేక ఒంటిమిట్ట మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ ప్రకటించారు శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశాల్లో మండల సమావేశం నిర్వహించాల్సి ఉండగా ఎంపీపీఎంపీటీ సభ్యులు గైరహాజరయ్యారు దీంతో సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు

ఆరోపణలు వద్దు అవినీతిపై విచారణ చేయించండి:రాచమల్లు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: వైఎస్సార్ కాంగ్రేస్ పార్టీ ప్రభుత్వంలో పేదల ఇళ్ల నిర్మాణం కోసం రామేశ్వరం, బొల్లవరం, మీనాపురం వద్ద భూములు కొనుగోలు చేశామని ఈ భూముల కొనుగోలులో పెద్దఎత్తున అవినీతి జరిగిందని ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి అసెంబ్లీలో మాట్లాడటం వింతగా ఉందని ప్రభుత్వంలో ఉన్న మీరు ఆరోపణలు చేయకుండా జరిగిన అవినీతిపై విచారణ చేయించాలని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి సవాల్ విసిరారు. శనివారం తన స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాచమల్లు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో పేదల ఇళ్ల నిర్మాణం కోసం రామేశ్వరములో 70ఎకరాల 34సెంట్ల భూమిని 34కోట్ల 73లక్షల 20వేల 432పైసలకు కొనుగోలు చేశామని, అలాగే బొల్లవరంలో 213ఎకరాల 30సెంట్లు భూమిని 85కోట్ల 88లక్షల 71వేలకు కొనుగోలు చేశామని, మీనాపురం వద్ద 104ఎకరాల 72సెంట్ల భూమిని 41కోట్ల 89లక్షలకు కొనుగోలు చేశామని, రైతులకు అప్పటి జిల్లా కలెక్టర్ హరికిరణ్ చెక్కుల రూపంలో అందజేశారని గుర్తు చేశారు. మాడు జగనన్నా కాలనీలకు సంబంధించి 476ఎకరాల 6సెంట్ల భూమిని 162కోట్ల 53లక్షల 46వేల 33వందల 60పైసలకు ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. జగనన్న కాలనీలకు మూడు ప్రాంతాలలో కొనుగోలు చేసిన భూమి విలువ 162కోట్ల 53లక్షల 40వేల 3వందల 60పైసలు అయితే 700కోట్లు అవినీతికి పాల్పడ్డానని అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే, పెద్దాయన వరదరాజుల రెడ్డి మాట్లాడటం వింతగా ఉందన్నారు. ప్రభుత్వం మీది, అధికారం మీది జరిగిన అవినీతిపై ఏసీబీ లేదా సీబీఐతో విచారణ చేయించవచ్చు కదా అని ప్రశ్నించారు. కేవలం నాపై అవినీతి బురద చల్లడం మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు పోరెడ్డి నరసింహారెడ్డి, ఎంపీపీ శేఖర్‌యాదవ్, చైర్మెన్ భీమునిపల్లె లక్ష్మిదేవి, కౌన్సిలర్లు వెంకటసుబ్బారెడ్డి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, వరికూటి ఓబుల్‌రెడ్డి, నాగేంద్రారెడ్డి, మన్నే సత్యం, ఆంజినేయులు, 34వ వార్డు ఇంచార్జ్ షేక్ ఖాజాపీర్ తదితరులు పాల్గొన్నారు.

కలికిరిలో రేషన్ బియ్యం తూకంలో మోసం

పప్పు చక్కెరకు గాను అదనపు వసూళ్లు. అధికారుల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర- కలికిరి: కలికిరి మండలంలో రేషన్ సరుకులు పంపిణీలో వాహనదారులు లోకంలో మోసం అధిక వసూళ్లకు అధిక వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు రావడంతో. పౌరసరఫరాల రాష్ట్ర స్థాయి అధికారుల ఆదేశాల మేరకు సివిల్ సప్లై అదనపు తాసిల్దార్ విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పిడిఎస్ వాహనాలు తనిఖీ చేశారు. రేషన్ పంపిణీ వాహనాల వద్ద మీకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే సరుకులు పంపిణీ చేస్తున్నారా అని వినియోగదారులను ప్రశ్నించారు. రేషన్ కార్డు లబ్ధిదారులు మాట్లాడుతూ మాకు 10 కిలోలకు కిలో పైగా తూకంలో వ్యత్యాసం వస్తోంది అని ఆరోపించారు. అంతేకాకుండా అరకిలో చక్కెరకు గాను 20 రూపాయలు కందిపప్పుకు 70 రూపాయలు మా వద్ద వసూలు చేస్తున్నారని తెలియజేశారు. వినియోగదారులు మాటలు విన్న తర్వాత సిఎస్ డి.టి విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కాకుండా అదనపు వసూలు చేసే అధికారం మీకు ఎవరు ఇచ్చారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వినియోగదారులు కచ్చితంగా సరిపడా చిల్లర తెచ్చుకొని అరకిలో చెక్కరకు 17 రూపాయలు. ఒక కిలో కందిపప్పు కు 67 రూపాయలు మాత్రమే చెల్లించాలని వినియోగదారులకు సూచించారు. ఇక్కడ మరో విషయం ఏమిటంటే వినియోగదారుడు వేలిముద్ర వేసిన తర్వాత తీసుకున్న సరుకులకు ఎంత మూల్యం చెల్లించారు అనే వివరాలు సీఎస్ ఎలక్ట్రానిక్ మిషన్ ద్వారా వినబడుతుంది. అంతేకాకుండా సరుకులు వివరములు అన్ని కూడా ప్రింట్ రూపంలో వినియోగదారులకు ఇవ్వాలి. కానీ కలికిరి కి చెందిన 10వ షాపు వాహనంలో సిఎస్ ఎలక్ట్రానిక్ మిషన్లో మాత్రం ఇటువంటివి ఏవి రావడం లేదు. మరీ ముఖ్యంగా తూకం వేయడానికి ప్రభుత్వం ఇచ్చిన ఎలక్ట్రానిక్ త్రాసులు కాకుండా ప్రైవేటు త్రాసులను ఉపయోగిస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నారు. తూకం వేసేటప్పుడు వినియోగదారునికి కనబడకుండా పంపిణీ దారులకు మాత్రమే కనబడడం గమనర్హం. సరుకుల వివరములు వాటి ధరలను ప్రతి వాహనంలో నోటీసు పలకలో రాసి కనరచాలి కానీ మండలంలో ఏ ఒక్క వాహనంలో కూడా అలా చేయడం లేదు. అయితే పై విషయాలు అన్నీ గమనించిన అధికారులు. ఇటువంటివి మరోసారి కనబడితే కచ్చితంగా వాహనాలు సీజ్ చేసి రేషన్ డీలర్లకు లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.అలా కాకుండా ప్రభుత్వ రేషన్ పంపిణీ వాహనదారులు ఎవరైనా సరే అదనపు వసూళ్లకు పాల్పడితే సంబంధిత అధికారులకు గాని మాకు తెలియజేయండి అటువంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటాం అని అన్నారు.

గీతాంజలి హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర- ప్రొద్దుటూరు: పట్టణంలోని గీతాంజలి హైస్కూల్ 20వ వార్శికోత్సవ వేడుకలు "గీతాంజలి ఉత్సవ్" అనే పేరుతో స్థానిక గోల్డన్ పార్క్‌లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సంధర్భంగా చైర్‌పర్సన్ శ్రీయారెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్ కూడ ప్రతి విధ్యార్థికి అవసం అని తెలియజేశారు. అన్ని రంగాలలో విధ్యార్థులు రాణించాలన్నారు. హెడ్‌మిస్ట్రేస్ మరియు ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విధ్యార్థుల భవిష్యత్తు గురించి చక్కగా వివరించారు. విధ్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ సమావేశంలో విధ్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం గీతాంజలి ఉత్సవ్ అనే పేరుతో సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విధ్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్జీవో హెూంలో మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర- ప్రొద్దుటూరు: ఏపీఎన్జీజీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్జీజీఓస్ హెూంలో మహిళా దినోత్సవం సంధర్భంగా ప్రొద్దుటూరు తాలూకా పరిధిలోని మహిళా ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా డా.సురేఖ, ఎన్జీఓ ప్రెసిడెంట్ రఘురామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సంధర్భంగా డా.సురేఖ మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళా ధైర్యం, సహనం, సమయస్ఫూర్తితో ముందుకు నడిచి సమస్యలు సాధించుకోవాలని, ఈనాడు ఉద్యోగిని అన్ని రంగాలలో పురుషులకు సమానంగా రాణించి దేశాభివృద్ధిలో తోడ్పాడుతు ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు ఆర్.జయమ్మ, మహిళా విభాగం కన్వీనర్ రషియా బేగం, వైస్ ప్రెసిడెంట్ జయంతికుమారి, రామసుబ్బయ్య, సహ అధ్యక్షులు సదాశివ యాదవ్, వైస్ ప్రెసిడెంట్‌లు మధు, శివ రామానుజ, నాగరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రభంజన, జాయింట్ సెక్రటరీ నాగార్జున, ఉమా మహేశ్వర రెడ్డి, ఆయుష్ విభాగం మహేష్ పాల్గొన్నారు.

300 లీటర్ల నాటు సారా ఊట ధ్వంసం

విశాలాంధ్ర - సుండుపల్లె : అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్ ఆదేశాల మేరకు రాయచోటి సమ్ డివిజన్ పోలీస్ ఆఫీసర్ మరియు రాయచోటి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్ సూచనల మేరకు శనివారం ఎస్సై ముత్యాల శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ బి డి నాయక్,కానిస్టేబుల్ ప్రవీణ్ కుమార్ హెూంగార్డు జిలాని భాష, సి పి ఓ కలిసి సుండుపల్లి మండలం తూర్పు మాలపల్లి సమీపంలో సిద్ధంగా ఉంచిన 300 లీటర్ల ఎఫ్ జె వాష్ ను ధ్వంసం చేయడం జరిగినది.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : శనివారం కడపలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని మాజీ మహిళా ఉపాధ్యక్షురాలు శ్యామలమ్మ, మాజీ నగర మహిళా అధ్యక్షురాలు నాగరత్న గౌడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిసిసి అధ్యక్షురాలు ఎన్.డి. విజయ జ్యోతి హాజరయ్యి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని వారికి ప్రత్యేక స్థానం ఉందని ఎల్లవేళలా వారిని గౌరవించాలని విజయ జ్యోతి కోరారు. వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన పెంచడానికి మైనారిటీ జిల్లా అధ్యక్షులు రహమతుల్లా ఖాన్ సిద్ధం చేసిన గోడపత్రికలను ఎన్.డి. విజయ జ్యోతి విడుదల చేశారు. ఈ కార్యక్ర మం లో సిటీ అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, పిసిసి ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్, మైనార్టీ క్రిస్టియన్ జిల్లా అధ్యక్షురాలు పిడిసంజయ్ కాంత పాల్గొన్నారు.

రాయచోటి -సుండుపల్లె డబుల్ రోడ్డును పూర్తి చేయండి

ఇన్చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి వినతి

విశాలాంధ్ర - సుండు పల్లె : అన్నమయ్య జిల్లా పర్యటనలో భాగంగా ఇంచార్జ్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని శనివారం సుండుపల్లెకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయ కులు మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ మాలేపాటి శివరాం నాయుడు,మాజీ ఎంపీటీసీ మోహన్ బాబు నాయుడు,మండల తెలుగు యువత అధ్యక్షులు మాలేపాటి సురేష్ నాయుడు, మస్తాన్ బాబులు వినతి పత్రాన్ని అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా మండల కేంద్రం నుండి జిల్లా కేంద్రానికి వచ్చేందుకు సరైన రోడ్డు మార్గం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గత వైసిపి ఐదు సంవత్సరాల కాలంలో 20 కిలోమీటర్ల రోడ్డు వేయలేక అర్ధాంతరంగా ఆగిన పనులను పునః ప్రారంభించాలని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. వెంటనే స్పందించిన ఇంచార్జ్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు.

షీ సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

విశాలాంధ్ర- పీలేరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రకాల సంస్థల నుండి విభిన్న ప్రతిభావంతులను గుర్తిస్తూ షీ సంస్థ సన్మానాలను చేయడం జరుగుతుందని అని సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పి వి ఎస్ లక్ష్మి మరియు న్యాయ సలహాదారులు డాక్టర్ రాయల సుధాకర్ రాయలు పత్రికాముఖంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాలలో పనిచేస్తున్న మహిళలను గుర్తిస్తూ పంచాయతీ డిపార్ట్మెంట్ నుండి పారిశుద్ధ కార్మికులను పాఠశాలల్లోని ఆయమ్మలను ఆసుపత్రుల్లో విశిష్ట సేవలు అందిస్తున్న మహిళలను సన్మానించడం జరుగుతుందని తెలియజేశారు కార్యక్రమంలో భాగంగా గుప్తా హాస్పిటల్ నుంచి మరియు శ్రీ భువన విద్యాలయం నుండి బిఎస్ఎన్ సిద్ధార్థ విద్యాసంస్థల నుండి మరియు పంచాయతీ పారిశుద్ధ కార్మికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా యోగ శ్రీ అవార్డ్స్ ను మాజీ ఎమ్మెల్యే శ్రీనాథ్ రెడ్డి రాకేష్ వారి అబ్బాయికి యోగ శ్రీ అవార్డును అందజేశారు.

దేశ ప్రగతికి మహిళ మూలాధారం

విశాలాంధ్ర- మదనపల్లె : దేశ ప్రగతికి మహిళే మూలాధారం,ప్రతి మహిళ, ప్రతి కుటుంబానికి రక్షణ కవచమని డాక్టర్ రాధిక పేర్కొన్నారు. బహుజనసేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు ఆధ్వర్యంలో శనివారం మదనపల్లె పట్టణం ఎస్టేట్ లోని రైజ్ ఆన్ డెనిమ్ ఇండియా ఫ్యాక్టరీ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డాక్టర్ రాధిక, ఎస్సై శివగామిని, లాయర్ రమాదేవి లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ మనుగడ సాగించడంలో మహిళలు ముఖ్యపాత్ర పోషించారన్నారు. ఈ సమావేశంలో డెనిమ్ ఇండియా కంపెనీ జిఎం సోలొమెన్ మురారి, హెచ్ ఆర్ మేనేజర్ స్వర్ణ, బహుజనసేన మహిళ నాయకు రాలు మేరీ, కళాకారులు లక్ష్మీ, ఉషారాణి, బాహు జన సేన నాయకులు గిన్నెల మనోహర్ రెడ్డి, మూడే రూపక్ నాయక్, శివ శంకర్ లారా, మెట్రో హరి, భాను ప్రకాష్, వెంకటేష్, నవీన్‌లతో పాటు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఇనామ్ భూసమస్యలకు పరిష్కారం చూపాలి

ఆర్డీఓకు బీటెక్ రవి వినతి

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందులలో ముస్లింలకు చెందిన ఇనాం భూములను సర్వే చేసి వారి హద్దులు చూపించాలని ఆర్డిఓ చెన్నయ్యకు శనివారం ఆర్డీవో కార్యాలయంలో పులివెందుల టిడిపి ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) వినతి పత్రాన్ని అందజేశారు. పులివెందుల ముస్లింల ఇనాములకు సంబంధించి స్థానిక టిడిపి కార్యాలయంలో మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలు కలిసి బిటెక్ రవితో చర్చించారు. అనంతరం ఆయన ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బిటెక్ రవి ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరుల ఇనామ్ భూసమస్యలను పరిష్కారం చేయాలని ఆయన కోరారు. కొంతమంది రైతులు మసీదులకు ఇచ్చిన స్థలాలను ఆక్రమించుకొని పంటలు పండించుకుంటున్నారన్నారు. రైతులతో కూడా మాట్లాడడం జరిగిందని వారి హద్దులు ఎక్కడికి వస్తాయో చూపిస్తే మా హద్దులలో మేము భూములు సాగు చేసుకుంటామని మసీదుకు సంబంధించిన భూములు మాకు అవసరం లేదని రైతులకు చెప్పడం జరిగిందన్నారు. పులివెందుల మున్సిపాలిటీ లోని ముస్లిం సోదరులు నమాజ్ చేసుకొవడానికి ఇబ్బందిగా ఉంది మసీదులు దూరం ఉండటం వల్ల వారు అక్కడికి వెళ్లి నమాజ్ చేసుకోవా లంటే ఇబ్బందిగా ఉందని కొత్త మసీదుల నిర్మాణానికి వారికి కేటాయిం చిన స్థలాలను కొలతలు వేసి చూపించాలన్నారు. మైనార్టీ నాయకులు రోడ్ల విస్తరణకు స్వచ్ఛందంగా వాళ్ల స్వాధీనంలో ఉన్న భూమిని కూడా పులివెందుల ప్రజల సౌకర్యం నాయకులు అడిగినప్పుడు స్వచ్ఛందంగా భూములు ఇవ్వడం జరిగిందన్నారు. మసీదుకు సంబంధించిన భూములు కొంత ఆక్రమణకు కూడా గురి అయ్యాయన్నారు. బ్రాహ్మణపల్లి రూట్లో 62 సెంట్లు మసీదు విసం రైతులతో మాట్లాడి ముస్లింలకు చెప్పడం జరిగింది అన్నారు. ఎవరికి ఇబ్బంది లేకుండా కొత్త మసీదులు నిర్మింప చేస్తామన్నారు. 16 సంవత్సరాల నుండి ఈ సమస్య అలాగే ఉందన్నారు. వీరి సమస్యను పరిష్కరించడమే లక్ష్యమన్నారు. మసీదులకు సంబంధించి కొన్ని స్థలాలను ప్రభుత్వం ఇవ్వడం జరిగిందని అవి ఎక్కడున్నాయో వారికే ఇంతవరకు తెలియదని అవి కూడా కొలతలు వేసి చూపించాలన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో స్పందిస్తూ సోమవారం మసీదులకు సంబంధించిన స్థలాలను కొలతలు వేసి వారికి ఉన్న హద్దుల వరకు చూపిస్తామని ఆయనకు హామీనిచ్చారు. అలాగే ఎవరైనా మసీదులకు సంబంధించిన స్థలాలను ఆక్రమించుకొని ఉంటే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ మహబూబ్ బాషా, కాశీం వలి, బాబా ఫక్రుద్దీన్, నల్లగారి భాస్కర్ రెడ్డి, గంగాధర్ రెడ్డి, మైనార్టీ నాయకులు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల సత్వరమే పరిష్కరించాలి:భూపేష్ రెడ్డి

విశాలాంధ్ర - జమ్మల మడుగు : జమ్మలమడుగు నియోజకవర్గం లోని ప్రజల నుంచి వచ్చే సమస్యల పై అధికారులు వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్ రెడ్డి ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే సమస్య లను పరిష్కరించాలని తెలియజేశారు. అనంతరం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 3,45000 రూపాయల చెక్కులను లబ్దిదారులకు అందించారు. ఎల్లవేళలా కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు. ప్రజా సమస్యల ఎప్పటికప్పుడు పరిష్కరిం చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

శ్రీ చైతన్యలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర -రాజంపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా పట్టణ కేంద్రంలోని ఆర్ఎస్ రోడ్డులో ఉన్నటువంటి శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం ప్రిన్సిపాల్ ఆకేపాటి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో మహిళలు అన్ని రంగాలలో రాణించడం అభినందనీయమన్నారు. ఎంతోమంది మహిళలు అన్ని రంగాలలో ప్రథమ స్థానంలో నిలిచిన ఘనత వారికే దక్కుతుందన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అనూష, డీన్ వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో వైభవంగా మహా సంప్రోక్షణ

విశాలాంధ్ర - ఒంటిమిట్ట : రెండో అయోధ్యగా విరాజి ల్లుతున్న ఒంటిమిట్ట రామాల యంలో మహా సంప్రోక్షణ శనివారం వేదమంత్రాలు మధ్య వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం గంటలకు చతుస్థానార్చనము, శ్రీమద్రా మాయణ యజ్ఞం, మూర్తి హోమం, సహస్రకలశాది దేవత హోమం, సహస్ర కలశాభిషేకం, పూర్ణాహుతి జరుగుతుంది. సాయంత్రం 6 గంటలకు కళాకర్షణ, శయ్యాదివాసం, ప్రధాన మూర్తి హోమం, తత్వ న్యాస హోమములు, వేదాది పారాయణం, అష్టబంధన సమర్పణ, శాంతి హోమం, పూర్ణాహుతి, మహా శాంతి అభిషేకం నిర్వహించ నున్నారు నిర్వహిం చనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నటేష్ బాబు టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్ ఇతర అధికారులు ఆలయ అర్చకులు పాల్గొన్నారు

ఆర్అండ్ ఏసి టెక్నీషియన్స్ సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర- కడప కార్పొరేషన్ : రిఫ్రిజిరేషన్ టెక్నిషియన్ కార్మికుల సమస్యలపైన, వారు పడుతున్న ఇబ్బందుల గురించి కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించడం సంతోషమని రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ టెక్నీషియన్ వెల్ఫేర్ అసోసియేషన్ (రాక్వా) కడప నగర అధ్యక్షుడు లెక్కల మురళీమోహన్ రెడ్డి అన్నారు. శనివారం కడపలో విలేకరులతో మాట్లాడుతూ ఆర్ అండ్ ఏసి టెక్నీషియన్స్‌కు లేబర్ డిపార్ట్మెంట్ లోని భవన నిర్మాణ కార్మికుల దాంట్లో ప్రత్యేక విభాగం కావాలని కోరారు. ఏడాదిలో కేవలం నాలుగు నెలలు మాత్రమే సీజన్ ఉంటుందని, మిగిలిన కాలంలో పనులు లేక ఆర్ అండ్ ఏసి టెక్నీషియన్స్ ఇబ్బందులు పడుతున్నారని బాధను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాక్వా సెక్రటరీ అక్రమ్ రషీద్, ట్రెజరర్ సయ్యద్ మైనుద్దీన్, కమిటీ మెంబర్స్ అశ్విన్, ప్రభాకర్ రెడ్డి, షరీఫ్, రాఘవ, సుబ్బు, ఆరిఫ్, మునవర్, రహమతుల్లా పాల్గొన్నారు.

చల్లా ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో పట్టణంలోని మైదుకూరు రోడ్డులో గల అన్వర్ హాల్ వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో 1000మందికి మంచి రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని ప్రజలకు అందజేశారు. స్వీటు కేసరి, వైట్‌రైస్, ఆకుకూర పప్పు, పెరుగు అన్నం, పచ్చికారం, అరటిపల్లు అందించారు.

సమస్యల నిలయంగా స్మశానం

ఆలంఖాన్ పల్లి స్మశానంలో మురుగునీటిని తొలగించాలి

స్మశాన పరిశీలనలో సిపిఐ నగర కార్యదర్శి యన్. వెంకటశివ

విశాలాంధ్ర-కడప రూరల్ : మురుగు నీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేక ఆలంఖాన్ పల్లె, దస్తగిరి పేట డ్రైనేజీ నీళ్ళు అన్నీ స్మశానంలో నిలుస్తూ జమ్మూ, బురదతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఐ నగర కార్యదర్శి యన్.వెంకటశివ, స్థానిక సిపిఐ నాయకులు చెంచయ్య, నాగరాజు, నరసింహులు, భరత్‌లు పేర్కొన్నారు. శనివారం స్థానిక 49వ డివిజన్ పరిధిలోని ఆలంఖాన్ పల్లె స్మశానం లోని మురుగు నీటిని, ఏపుగా పెరిగిన జమ్ము,కంప చెట్లను సిపిఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలంఖాన్ పల్లె లో వందలాది కుటుంబాలకు చెందిన స్మశానంలో దీర్ఘకాలంగా అనేక సమస్యలు నెలకొన్నప్పటికీ సంబంధిత ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ఈ స్మశాన సమస్యపై రెండేళ్లుగా జిల్లా కలెక్టర్, నగర పాలక కమీషనర్,ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటి వరకు స్పందన లేదన్నారు. వివిధ కారణాలతో మృతి చెందిన వారికి గౌరవంగా,సాంప్రదాయంగా స్మశానంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. స్మశానం రెండు వైపులా సాగు భూములు వెంచర్‌లుగా మారిన నేపథ్యం లో ఇంకా స్మశాన సమస్యలు పెరిగాయన్నారు. స్మశానంలో మురుగునీరు నిలువకుండా ప్రధాన రహదారి ప్రక్కనే దండు మీదుగా రాళ్ల వంకలోకి డ్రైనేజీ కాలువను నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. మృతదేహాలను పూడ్చు కోవడానికి వీలు లేకుండా జమ్ము,కంప చెట్లను తక్షణం తొలగించాలన్నారు. నగర పాలక యంత్రాంగం నిర్దిష్ట కాలపరిమితితో స్మశాన సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం లక్ష్యం: చైర్మన్

విశాలాంధ్ర-పులివెందుల: మహిళా సాధికారత సాధించడమే అంతర్జాతీయ మహిళా దినోత్సవ లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ అన్నారు. స్థానిక ఉర్దూ ఉన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని స్నేహితఅమృతహస్తం సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత ఉపధ్యాయ బృందంలోని మహిళా ఉపాధ్యాయనీలకు, అలాగే ఉపాధ్యాయుల సతీమణులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిన్నప్పలు మాట్లాడుతూ స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం అందిస్తున్న గ్రామీణ, పట్టణ ప్రాంత పేద విద్యార్థుల కొరకు అహర్నిశలు అందిస్తున్న సేవలను ప్రశంసనీయమన్నారు. ఈ సృష్టిలో స్త్రీ శక్తి అనంతం అని, స్త్రీ లేనిదే ఈ సృష్టి లో మానవాలి మనుగడ సాగదని, అలాంటి స్త్రీల రుణం ఎన్నటికీ తీర్చుకోలేనిదన్నారు. కార్యక్రమంలో ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం వెంకటనారాయణ, రామక్రిష్ణయ్య, మహేశ్వర్ రెడ్డి, సుబ్బిరెడ్డి దంపతులు,ఉచిత విద్య ఉపాధ్యాయ బృందంలోని శ్రీదేవి, సేవాసమితి కార్యదర్శి సునీత, నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్,సభ్యులు చాంద్ బాషా, ఉర్దూ అకాడమీ మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా -బాలుడు మృతి

నలుగురికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర -రామాపురం : చిత్తూరు- కర్నూలు 40వ జాతీయ రహదారిని రామాపురం మండలం చిట్లూరు పంచాయయి పాలన్నా గారిపల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు బోల్తా పడిన ఘటనలో దర్శత్ సాయి(1) బాలుడు మృతి చెందగా నలుగురు తీవ్ర గాయాలు పాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసు కథ నం మేరకు వివరాలు ఇలా వున్నాయి.గుర్రంకొండ మండలం టౌన్ కు చెందిన పాలకొండ రాయుడు తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో కడప సమీపంలో ఉన్న పాలకొండలోని పాలకొండ రాయుని వద్దకు బయలుదేరారు. మార్గ మధ్యలోకి రాగానే రామాపురం మండల పరిధిలోని పాలన్న గారి పల్లె వద్దకు రాగానే రోడ్డు పైన కుక్క కనిపించడంతో కుక్కను తప్పించబోయి డ్రైవర్ కారును ప్రక్కకు తిప్పడంతో కారు అదుపుతప్పి బోల్తా పడింది.ఈ ఘటనలో దర్శత్ సాయి(1) మృతిచెందగా డ్రైవర్ రాఖి. నాగేష్. మౌనిక. పూజిత లు. గాయాల పాలయ్యారు. గాయపడిన వారిని ప్రథమ చికిత్స నిమిత్తం 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన ఎస్సై వెంకట సుధాకర్ రెడ్డి తెలిపారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

కలమల్లలో ఘనంగా మహిళా దినోత్సవం

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ఇటీవలి కాలంలో మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతూ రాణిస్తున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వారికి ఇతోధిక తోడ్పాటును అందిస్తున్నాయని ఎర్రగుంట్ల ఎంపీడీవో వెంకటరమణయ్య పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కలమల్ల గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జిల్లాలో కలమల్ల పంచాయతీని మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయతీగా ప్రభుత్వం ఎంపిక చేయడాన్ని ఆయన గుర్తుచేశారు. దేశాభివృద్ధిలో మహిళల పాత్ర గణనీయంగా పెరిగిన నేపథ్యంలో వారికి ఎంపీడీవో వెంకటరమణయ్య శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హెప్సిబా, మండల ఉపాధ్యక్షులు పొన్నా శీను, ఈఓపీఆర్‌డీ రంతుల్లయ్య, ఏపీఎం జగదీశ్వరితో పాటు చిలమకూరు పీహెచ్‌సీ వైద్యులు, సచివాలయ, గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఛలో పిఠాపురం.. విజయవంతం చేయండి

విశాలాంధ్ర - బద్వేలు : పట్టణంలోని రాఘవేంద్ర కళ్యాణమండపంలో జనసేన పార్టీ కార్యకర్తల సమావేశం నియోజకవర్గ జనసేన పీఓసీ బసవి రమేష్ అధ్యక్షతన తుడిమెళ్ళ మురలీకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కడప పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త తాతంశెట్టి నాగేంద్ర, జనసేన కో-ఆర్డినేటర్ సుంకర శ్రీనివాస్ హాజరయ్యారు. జనసేన సమన్వయ సమావేశం పార్టీ కార్యాలయం నందు ఏర్పాటు చేసి కార్యకర్తలకు చలో పిఠాపురం జనసేన ఆవిర్భావ సభ గురించి దిశ నిర్దేశం చేశారు. అనంతరం చలో పిఠాపురం పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గం కార్యవర్గంతో పాటు అందరిని పిఠాపురం ఆహ్వానిస్తూ దిగ్విజయం చేద్దామని పిలుపునిచ్చారు.

సచివాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం

విశాలాంధ్ర-ఒంటిమిట్ట: "రాణి రుద్రమదేవి పరిపాలనా సామర్థ్యానికి, నిర్మలా సీతారామన్ ఆర్థిక ప్రాభవానికి సాక్ష్యమే మహిళల శక్తి!" అంటూ భాజపా మండల శాఖ అధ్యక్షుడు భాను ప్రకాష్ రాజు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒంటిమిట్ట పంచాయతీ సచివాలయంలో జరిగిన వేడుకలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్, ఒంటిమిట్ట చెరువు ఆయకట్టు సంఘం వైస్ చైర్మన్ కట్టా యానాదయ్య బిజెపి మాజీ మండలాధ్యక్షుడు బాలరాజు శివరాజు తదితరులు పాల్గొన్నారు. భాను ప్రకాష్ రాజు మాట్లాడుతూ మహిళలు దేశ ఆర్థిక వ్యవస్థను సమర్థవంతంగా నడిపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ, ఇప్పుడు మహిళల భాగస్వామ్యం లేకుండా ఏ కుటుంబాన్నీ ఊహించలేము. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలోని వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలు అందించిన మహిళలను ఘనంగా సన్మానించి, వారి కృషిని ప్రశంసించారు.

అనుమతులు లేకుండా అర్ధరాత్రి మట్టి మాఫియా

విలేకరులపై దౌర్జన్యం - జేసిపి యజమానిపై ఫిర్యాదు

విశాలాంధ్ర - సుండుపల్లె : మండల కేంద్రానికి కూత వేటు దూరంలో పెద్దమాదిగపల్లె సమీపంలో ఎటువంటి అనుమతులు లేకుండా అర్ధరాత్రి సమయంలో మట్టి మాఫియా చెలరేగిపోతోంది దీంతో గ్రామస్తులు, రెవెన్యూ అధికారులకు పోలీసు అధికారులకు పాత్రికేయులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి వెళ్లిన పాత్రికేయులపై తిరుమల జెసిపి యజమాని వెంకటేష్ దురుసుగా మాట్లాడడంతో శనివారం ఏపీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి పల్లం చందు మండల అధ్యక్షులు తిరుపాల్ నాయక్ ఆధ్వర్యంలో ఎస్సై ముత్యాల శ్రీనివాసులకు విలేకరులతో కలిసి ఫిర్యాదు చేశారు. విలేకరులపై దురుసుగా ప్రవర్తించిన జెసిపి ఓనర్ పై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. శుక్రవారం అర్ధ రాత్రి సమయంలో జెసిపి ట్రాక్టర్లతో మట్టిని ప్లాట్లు వేసే అందు కోసం ఇటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న వ్యక్తులను గ్రామ ప్రజలు అడ్డుకొని సంబంధిత అధికారులకు విలేకరులకు సమాచారం ఇవ్వడంతో న్యూస్ కవరేజ్ కి వెళ్ళిన అరుణ్ కుమార్ నాయుడు, హరిబాబు,షేక్.యూసుఫ్ విలేకరులపై జెసిపి ఓనర్ వెంకటేష్ విలేకరులను బెదిరించి దుర్భాషలాడాడు విషయం పై ఎస్ఐకి తరణం స్టాఫ్ రిపోర్టర్ అరుణ్ నాయుడు ఫిర్యాదు చేయడం జరిగింది.ఈ విషయంపై ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు స్పందిస్తూ గతంలో ఆ వ్యక్తి పై కేసు కూడా ఉందని చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర -రాజంపేట: రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మన్నూరు నందు 30 మంది మహిళా ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాలలో ముందున్నారని, మహిళలు ఆధునిక సమాజంలో కీలకమని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బోయనపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు భారతి, గర్ల్స్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయరాలు జయలక్ష్మి మాట్లాడుతూ ఎస్ టి యు ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు జరపడం అభినందన్టియమని పేర్కొన్నారు. పురుషుల ప్రోత్సహం ఉంటే మహిళలు అన్నిరంగాలలో రానిస్తారని పేర్కొన్నారు.రీజినల్ కన్వినర్ నర్సింహా, మండల అధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఆర్థిక కార్యదర్శి శంకర్ నాయక్, సత్యనారాయణ, ఓబులేసు, మోహనరావు, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, పెంచలయ్య, గంగాధర్, అన్నపూర్ణ, మదాలస, ఆదిలక్ష్మి, సుధారాణి, శశికళ, మాధురి, విజయలక్ష్మి, కళ్యాణి, హేమలత, స్వాతి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళా టీచర్లపై దాడి హేయమైన చర్య

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం మహిళా టీచర్లపై అదే పాఠశాలలో టిజిటి ఉపాధ్యాయుడు గురునాథరెడ్డి దాడిచేయడం హేయమైన చర్య అని బిజెపి నాయకురాలు సుష్మ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకవైపు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సగర్వంగా జరుపుకుంటున్న వేళ ఒక తోటి ఉపాధ్యాయుడు ఇలాగ మహిళలపై దాడులు చేయడం సమంజసం కాదన్నారు. విద్యార్థులకు పాఠాలు నేర్పించే ఉపాధ్యాయుడు, బాలికల పాఠశాలలో ఇలా తోటి ఉపాధ్యాయునులపై దాడులు చేస్తుంటే పాఠశాలలో చదువుతున్న బాలికలు పాఠశాలకు ఎలా రాగలుగుతారని ప్రశ్నించారు. ఒకవైపు బేటి బచావో బేటి పడావో అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుంటే ఇలాంటి సంఘటనలు జరుగుతుండడం చాలా బాధాకరమన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళలు అన్ని రంగాలలో ముందున్నారు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : మహిళలు అన్ని రంగాలలో ముందుండి సమాజంలో మేము సైతం అంటూ ముందుకెళుతున్నారని డాక్టర్ జి. విజయ లక్ష్మి అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కెయస్ఆర్ఎం కాలేజ్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కడప నగరంలోని ఎస్ కేఆర్ అండ్ ఎస్ కే ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆర్థికశాస్త్ర అధ్యాపకులుగా పనిచే స్తున్న డాక్టర్ జి. విజయ లక్ష్మి మాట్లాడుతు మహిళలు దేనిలోనూ తక్కువ కాదంటూ నింగిలా సగం అంటూ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ విజయాలు సాధిస్తున్నారన్నారు. అనంతరం కెఎల్ఎం కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నమ్మ మాట్లాడుతూ మహిళలూ ఆత్మవిశ్వాసంతో సాధించలేనిది ఏదీ లేదని మహిళలపై అగాయిత్యల పట్ల అవేదన వ్యక్తం చేశారు. కెయస్ఆర్ఎం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎన్ ప్రసాద్ మాట్లాడుతూ మహిళలు, బాలికల హక్కులు, సమానత్వం, సాధికారతపై ఆధార పడి ఉంటుంది, అంతే కాదు ఇది మహిళల జీవితాలను మెరుగుపరచడానికి, వేగవం తమైన పురోగతికి, మహిళలకు సాధికారత కల్పించడానికి, సమాన అవకాశాలను, మహిళల హక్కులు, సమానత్వం గురించి అవగాహన పెంచడం గురించి ప్రసంగిం చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి ఎస్ఎస్ మూర్తి, కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, ఉమెన్ ఎంపవర్మెంట్, ఉమెన్ ప్రొటెక్షన్, జెండర్ ఈక్వాలిటీ, స్టూడెంట్ ఆక్టివిటీ కౌన్సిల్, ఉమెన్ ఫ్యాకల్టీ, విద్యార్థినిలు పాల్గొన్నారు.

మాల మహానాడు నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - బద్వేలు : మాల మహానాడు ఆధ్వర్యంలో బద్వేల్ పట్టణంలో జరిగిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి సీనియర్ మాల మహా నాడు నాయకులైనటు వంటి కూకట్పల్లి మురళి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులు జిల్లా మాల మహానాడు అధ్యక్షులు జె.భాస్కర్ నేషనల్ వుమన్ రైట్స్ రాష్ట్ర కార్యదర్శి ముత్యాల ప్రసాద్ హాజరు అయ్యారు. ఈ సమావేశంలో ప్రస్తుతం మన రాష్ట్రంలో జరుగుతున్న వర్గీకరణకు వ్యతిరేకంగా నియోజకవర్గస్థాయిలో ఐక్యత చాటాలని ఏకం కావాలని రాష్ట్ర మాల మహానాడు పిలుపుమేరకు శనివారం సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఏడు మండలాల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు నియోజకవర్గ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశానికి కాశినాయన మండలం,పోరుమామిళ్ల మండలం, కలసపాడు మండలం, బికోడూరు మండలం అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు మాలమహానాడు నాయకులు పి.నారాయణ, ఎన్.సుబ్బరాయుడు, పి వెంకటయ్య, బండి ఓబయ్య, వంకెల నారాయణ, ఎన్.రమ ణయ్య, కె.తిరుపాల్,మల్లికార్జున, వెంకటరమణ, పి గంగయ్య, మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలి

విశాలాంధ్ర-యర్రగుంట్ల : రాష్ట్ర అసెంబ్లీలో వైసీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదాను కల్పించడం ద్వారా ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించే అవకాశాన్ని స్పీకర్ కల్పించాలని ఎర్రగుంట్ల పట్టణ వైసీపీ అధ్యక్షులు వై.జయరామకృష్ణారెడ్డి కోరారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన పార్టీ సీనియర్ నాయకులు దాసరి ఎల్లారెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. సాధారణ ఎమ్మెల్యేలకు అసెంబ్లీలో మాట్లాడేందుకు తక్కువ సమయం ఇస్తారని అదే ప్రతిపక్ష హోదా కల్పిస్తే అధిక సమయం లభించే వెసులుబాటు ఉంటుందని ఆయన గుర్తుచేశారు.తద్వారా ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించే అవకాశాన్ని కల్పించాలని ఆయన కోరారు. రబీ సీజన్‌లో రైతులు సాగుచేసిన బుడ్డ శనగ పంట ప్రకృతి వైపరీత్యాలతో దిగుబడి గణనీయంగా తగ్గిన నేపథ్యంలో కర్షకులను ఆదుకునేందుకు వారికి ప్రభుత్వం పరిహారం చెల్లించడంతో పాటు అరకొర పండిన బుడ్డశనగలకు గిట్టుబాటు ధర నిర్ణయించి మార్క్‌ఫెడ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆయన సూచించారు.

ఛలో విజయవాడను మున్సిపల్ కార్మికులు జయప్రదం చేయండి :ఏఐటియుసీ

విశాలాంధ్ర-కడప రూరల్ : మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం గత తొమ్మిది నెలల కాలంలో పరిష్కరించక పోగా ఆప్కాస్ విధానం రద్దు చేసి ఏజెన్సీలకు అప్పగించాలనే విధానాలకు స్వస్తి పలికి పెర్మనెంట్ చేయాలని ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో మార్చి 11న 'చలో విజయవాడ' కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నామని జయప్రదం చేయాలని ఏపీ మున్సి పల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్ యందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గోడపత్రాలు విడుదల చేసిన సుబ్బరాయుడు మాట్లాడుతూ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లిస్తూ ఆప్కాస్ రద్దు ఏజెన్సీలు వద్దు పర్మనెంట్ కావాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఉద్యోగ, కార్మికుల వేతనాల చెల్లింపులు మునిసిపల్ శాఖ నుంచే చెల్లించాలని, ఉద్యోగులకు, కార్మికులకు సాంఘిక భద్రత కల్పించాలని, ఇంజనీరింగ్ కార్మికుల వేతనాల పెరుగుదలపై గత సమ్మెలో నాటి ప్రభుత్వ ఒప్పంద అగ్రిమెంట్ తక్షణం అమలు చేయాలని కోరారు. వివిధ ప్రభుత్వ శాఖలలో పర్మనెంట్ ఉద్యోగులకు చెల్లించిన ట్లుగానే మున్సిపల్ పర్మనెంట్ కార్మికుల సరెండర్ లీవులు ఎన్కామ్మెంట్ పెండింగ్ లో ఉన్న మూడు డిఎలను తక్షణమే చెల్లించేటట్లు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని పాఠశాల స్వీపర్లకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు.ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జి వేణుగోపాల్,ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కేసి.బాదుల్లా, ప్రధాన కార్యదర్శి తారక రామారావు, నాయకులు మధు,ప్రతాప్, వికాస్, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు పి సుబ్బరాయుడులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ప్రెసిడెంటుగా తులసిరామ్

విశాలాంధ్ర- పులివెందుల: పులివెందుల బార్ అసోసియేషన్ ప్రెసిడెంటుగా తులసిరామ్ ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శిగా కిశోర్‌కుమార్‌రెడ్డి, కోశాధికారి నరసింహులు, జాయింట్ సెక్రటరీగా శశిరేఖ్‌లు ఎన్నికయ్యారు. వీరందరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు న్యాయవాదులు తెలిపారు.

తొండూరులో ఉద్రిక్తత

టిడిపిలో భగ్గుమన్న విభేదాలు -మోహరించిన ఇరువర్గాల అనుచరులు

చెదరగొట్టిన పోలీసులు

విశాలాంధ్ర-తొండూరు: టిడిపిలో వర్గ విభేదాలు భగ్గుమనడంతో తొండూరులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరువర్గాల అనచరులు మోహరించడంతో భయాందోళన నెలకొంది. పోలీసులు సమన్వయంతో వ్యవహరించి ఇరువర్గాల అనుచరులను చెదరగొట్టడంతో పరిస్థితి సద్దుమణిగింది. వివరాల్లోకి వెళితే.. తొండూరు బిసి హాస్టల్‌లో మరుగుదొడ్ల నిర్మాణానికి కు రూ.2లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిర్మాణపు పనులను ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి మల్లేల గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి అప్పగించారు. సదరు ఆ వ్యక్తి శుక్రవారం పనులు ప్రారంభించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక టిడిపి నేత శివమోహన్‌రెడ్డి వర్గీలు ఆక్షేపించి పనులను నిలుపుదల చేశారు. అయితే తిరిగి యధావిధిగా ఆ వ్యక్తి శనివారం పనుల నిర్మాణం మళ్లీ ప్రారంభించారు. మరోసారి విషయం తెలుసుకున్న శివమోహన్‌రెడ్డి వర్గీయులు హాస్టల్ వద్దకు వెళ్లి పనులను నిలుపుదల చేయాలని హుకుం జారీచేశారు. ఇంతలో వ్యక్తి ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి సతీమణి ఉమాదేవికి నిలుపుదల విషయాన్ని చేరవేశారు. దీంతో అటు ఉమాదేవి ఇటు బిటెక్ రవి వర్గీలు ఒక్కసారిగా తొండూరు చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. రెండు వర్గాల మధ్య నెలకొన్న వర్గ వైషమ్యాలు ఎలాంటి ఉద్రిక్తతలకు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ఉండాలని స్థానికులు కోరుతున్నారు.

600 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

విశాలాంధ్ర - బద్వేలు : పట్టణంలోని నాలుగు రోడ్ల సమీపంలోలారీలో తరలిస్తున్న 600 బస్తాల రేషన్ బియ్యం లారీ పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు బద్వేల్ అర్బన్ సీఐ రాజగోపాల్ తెలిపారు. మైదుకూరు నుండి చెన్నై లారీలో రేషన్ బియ్యం తరలిస్తుండగా నాలుగు రోడ్లసమీపంలో పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారుబియ్యం శాంపిల్స్ తీసి ల్యాబ్‌కి పంపిస్తున్నట్లు ల్యాబ్ నుంచి రిపోర్ట్ వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటున్నట్లు అర్బన్ సీఐ రాజగోపాల్ తెలిపారు.

నేడు పెద్దకుడాలలో గంగమ్మ తిరుణాల

విశాలాంధ్ర-లింగాల: తలపై బోనం రెండు చేతుల్లో వేపమం డలు మరోవైపు సిందు వాదన ఇవన్నీ కలిస్తే జెజ్జెనకర జనారే అనిపిస్తుంది. అనాలనిపిస్తుంది. శివరాత్రి పండుగ అనంతరం జరిగే తిరుణాళ్లలో పెద్దకుడాల గంగమ్మ తిరుణాల ఒకటి. ప్రతి ఏటా శివరాత్రి పర్వదినం తర్వాత వచ్చే రెండో ఆదివారం పెద్దకుడాల గ్రామంలో గంగజాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో పెద్దకుడాల గ్రామంలో వెలసిన గంగమ్మ తిరుణాల నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ జాతరకు స్థానికంగానే కాకుండా జిల్లాయేతర ప్రాంతాలతో పాటు కర్నాటక రాష్ట్రం నుంచి భక్తులు వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు.

ఆలయ చరిత్ర

పూర్వము చిన్న కుడాలి, పెద్ద కుడాలి అను ఇరువురు అన్నదమ్ములు బతుకుదెరువు నిమిత్తం ఈ ప్రాంతం వలస వచ్చారు. వారితో పాటు గొర్రెలను అలాగే గంపలో రెండు గంగమ్మ ప్రతిమలను తీసుకువచ్చారు. ఇక్కడ గ్రాసంతోపాటు నీరు అలాగే వారు నివాసయోగ్యానికి అనువుగా ఉండడంతో ఇక్కడే స్థిరపడ్డారు. చిన్నసాటి గుడి నిర్మించి గంగమ్మ తల్లి దేవతను ప్రతిష్టించారు. ఇలా కొంతకాలం గడిచిన తర్వాత అన్నదమ్ముల మధ్య మనస్పర్ధలు, విభేదాలు రావడంతో విడిపోయారు. పెద్ద కుడాల చిన్న కుడాల గ్రామాల మధ్య మోతకల వాగు ఉంది. ఈ వాగుకు ఒకవైపు చిన్న కుడాలి మరొకవైపు పెద్దకుడాలి ఉండిపోయారు. అవే ఇప్పుడు పెద్ద కుడాల చిన్నకుడాల గ్రామాలుగా పిలుస్తున్నారు. మరి కొంతకాలం తర్వాత ఒక వ్యక్తి అమ్మవారిపై ద్వేషం పెంచుకున్నారు. దీంతో అమ్మవారు ఆగ్రహానికి గురైన ఆ వ్యక్తి కుటుంబం అనేక విధాలుగా కష్టాలను ఎదుర్కొంది. అప్పుడు మహిమగల తల్లిగా గంగమ్మ దేవతను భావించి నాటి నుండి నేటి వరకు అమ్మవారు భక్తుల నీరాజనాలు అందుకుంటున్నారు.

జాతర ఉపయోగాలు

జాతర వల్ల పలు ఉపయోగాలున్నాయి. బంధు అనుచర వర్గమంతా ఒకే చోట చేరడం, యోగక్షేమాలు తదితర అంశాలు చర్చించుకునే అవకాశం ఉంది. పైగా తిరుణాల వల్ల అక్కడ వివిధ రకాల దుకా ణాలు ఏర్పాటు చేసుకున్న చిరువ్యాపారులకు కూడా కాస్త ఉపాధి లభిస్తుంది. అంతేకాదు భక్తులు సమర్పించే కానుకలు కూడా ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తాయి. ప్రాచీనకాలం నుంచి ఇలాంటి సంప్రదాయాల వల్ల ఆలయాలు అభివృద్ధి చెందాయి. ప్రస్తుతం ప్రభుత్వాలు కూడా ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నాయి.

అంచెలంచెలుగా ఆలయ అభివృద్ధి

పెద్దకుడాల గ్రామంలో వెలసిన గంగమ్మ దేవత ఆలయం అంచెలం చెలుగా అభివృద్ధి చెందింది. ప్రస్తుతం ఆలయ కమిటీ చైర్మన్ గా జయ చంద్రారెడ్డి వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగమ్మ తిరుణాలకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆదివారం సాయంత్రం అమ్మోరు గ్రామోత్సవం ఉంటుందన్నారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి అనుగ్రహం పొందాలని జయచంద్రారెడ్డి ఈ సందర్భంగా కోరారు.

మహిళలు అన్ని రంగాలలో రాణించాలి:డిఎస్పీ

విశాలాంధ్ర - బద్వేలు : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి డ్వాక్రా అంగన్వాడి పాఠశాల విద్యార్థినిలతో కలిసి పట్టణంలోని పలు మెయిన్ బజార్ వరకు బద్వేల్ అర్బన్ సీఐ రాజగోపాల్ రూరల్ సిఐ నాగభూషణం ఏర్పాటు చేసిన ర్యాలీలో మైదుకూరు డిఎస్పి రాజేంద్రప్రసాద్ మున్సిపల్ కమిషనర్ వివి నరసింహారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఎస్పి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఇది మహిళలు సాధించిన విజయాలను గౌరవ వించడానికి అంకితం చేయబడిన రోజు.మహిళలు లేనిదే ఈ సృష్టి లేదని ఎంతో మంది మహిళలు మన దేశానికి రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ యొక్క ఆధునిక ప్రపంచ యుగంలో మహిళలు సైన్స్,రాజకీయం,వ్యాపారం,విద్య కళలు ఏదైనా సమాజాన్ని మెరుగుపరచడానికి చాలా కృషి చేయడం జరిగింది అని తెలిపారు.ఇంకా మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ సుబ్బారెడ్డి అర్బన్ ఎస్ఐ రవికుమార్ గోపవరం ఎస్ఐ శ్రీకాంత్ బద్వేలు గోపవరం పోలీస్ సిబ్బంది గురుకుల పాఠశాల విద్యార్థినిలు మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రోడ్ల పరిస్థిగురించి మంత్రికి వివరించిన అధికారులు

విశాలాంధ్ర-రాయచోటి: అన్నమయ్య జిల్లాలో 14 కోట్ల రూపాయల వ్యయంతో రోడ్ల గుంతలు దాదాపు 99 శాతం పూర్తి చేసినట్లు ఆర్ అండ్ అధికారులు జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి, రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వివరించారు. శనివారం రాయచోటికి విచ్చేసిన మంత్రిని జిల్లా ఆర్ బీ శాఖ ఉన్నతాధికారులు మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మనల్ని నమ్మి కాంట్రాక్టర్లు ముందుకు వచ్చి పనులు చేయడమే గాక వేగంగా పనులు పూర్తి చేసిన నేపథ్యంలో సకాలంలో వారికి బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామనని హామీ ఇచ్చారు. అలాగే రాయచోటి రింగురోడ్డు 4.5 కిలోమీటర్లు అసంపూర్తిగా ఉందని అందుకు గానూ రూ. 8 కోట్లు నిధులు కేటాయిస్తే బైపాస్ నిర్మాణం పూర్తవుతుందని అధికారులు తెలియజేశారు. వెలిగల్లు ప్రాజెక్టు దగ్గర ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉందని అక్కడ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నిర్మిస్తే పర్యాటకంగా కూడా అభివృద్ధి జరుగుతుందని స్థానిక మంత్రి సోదరుడైన మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి మంత్రి దృష్టికి తీసుకురాగా, అందుకు సహకరిస్తామని మంత్రి తెలియజేశారు.

మహిళలు అన్ని రంగాలలో రాణించాలి:ఆర్డీవో

విశాలాంధ్ర - జమ్మలమడుగు : మహిళలు అన్ని రంగాలలో రాణించినప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందని జమ్మల మడుగు రెవెన్యూ డివిజనల్ అధికారి సాయి శ్రీ తెలిపారు. శనివారం జమ్మలమడుగు పట్టణంలోని గౌసియా షాది ఖానా లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఆర్డీవో సాయి శ్రీ హాజరై మహిళలను,విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆర్డీవో సాయి శ్రీ మాట్లాడుతూ విద్య ద్వారా మహిళలు తమ జీవితాన్ని మెరుగుపరుచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చెప్పారు. విద్య అనేది ప్రతి మహిళకు సత్తా, గౌరవం, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని అందించే శక్తివంతమైన ఆయుధమని తెలియజేశారు. మహిళా విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటూ సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థిక సహాయాన్ని అందజేసి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. అర్బన్ సీఐ లింగప్ప మాట్లాడుతూ మహిళలు కుటుంబ జీవితానికి మూలస్థంభాలని తెలిపారు. కావున సామాజిక అభివృద్ధికి గొప్ప సహకారం అందించే దిశగా ప్రతి మహిళ నడుం బిగించాలని తెలిపారు. చివరగా వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మహిళా వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన వారి చేతులమీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది భూతమాపురం సుబ్బారావు, మహిళలు మరియు విద్యార్థినిలు పాల్గొన్నారు.

జిల్లా సమగ్ర అభివృద్ధి సాధనే లక్ష్యంగా సమరశీల పోరాటాలు

జె. వెంకట్రామిరెడ్డి 29వ వర్ధంతి సభలో గాలి చంద్ర సిపిఐ జిల్లా కార్యదర్శి పిలుపు

విశాలాంధ్ర-కడప రూరల్ : కరువు వలసలు ఆత్మహత్యల విముక్తికి నిధులు నికరజలాలు కేటాయింపు కోసం జిల్లా సమగ్ర అభివృద్ధి సాధన కోసం సమరశీల పోరాటాలు నిర్వహించడమే కమ్యూనిస్టు యోధులు జే వెంకట్రామిరెడ్డి (జెవి) కి ఘనమైన నివాళి అని శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగిన జేవి 29వ వర్ధంతి సభలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనిమెల అనే మారుమూల గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించిన జెవి కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితుడై అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా పోరాటాలు చేశారని నిషేధాలను నిర్బంధాలను లెక్కచేయకుండా ప్రాణాలను పణంగా పెట్టి పార్టీ పటిష్టత కోసం కృషి చేశారన్నారు. రెండు పర్యాయాలు పార్టీ జిల్లా కార్యదర్శిగా జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టుల కోసం ముఖ్యంగా జిల్లాకు గుండెకాయ లాంటి గండికోట ప్రాజెక్టు కోసం ఆమరణ నిరాహార దీక్షకు చేపట్టి విజయం సాధించిన అనతి కాలంలోనే అమరులయ్యారన్నారు. పాలక ప్రభుత్వాలు లక్షల కోట్ల బడ్జెట్లో ప్రవేశపెడుతున్నాయి కానీ నీటిపారుదల ప్రాజెక్టుల కోసం కేటాయింపులు నాకు మాత్రం చేయడమే కాకుండా ప్రాధాన్యత క్రమంలో రాయలసీమ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులో తీవ్రమైన నిర్లక్ష్యం వివక్షత కొనసాగు తుందన్నారు. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో సాగు భూమి సొంత ఇంటి స్థలం లేనివారు రోజువారి కూలీకి పోయి నిరంతరం అనుచివేతకు గురవుతున్న అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాటాలు చేపట్టాలన్నారు. విద్యార్థి యువజన శ్రామిక మహిళా మైనారిటీ రంగాల సమస్యలపై పోరాటాలు నిర్వహించాలన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధి సాధనే లక్ష్యంగా పోరాటాలు చేయడం ద్వారానే జెవి గారికి ఘనమైన నివాళిని మరో మారు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి ఎన్.వెంకట శివ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంవి సుబ్బారెడ్డి, పి సుబ్బరాయుడు, పి చంద్రశేఖర్, జి వేణుగోపాల్, కేసి బాదుల్లా, సుబ్రహ్మణ్యం, సి ఆర్ వి ప్రసాద్, డబ్ల్యూ రాము, పి భాస్కర్, జి మద్దిలేటి, కే మునయ్య, శంకర్ నాయక్, బ్రహ్మం, మనోహర్ రెడ్డి, శివశంకర్, బాలచంద్రయ్య నాయుడు, పి చంద్రశేఖర్ రెడ్డి, అరుణ్ తేజ, నరసింహారావు, నాగరాజు, పకీరప్ప తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే సమాజ అభివృద్ధి

బద్వేలు ఎమ్మెల్యే దాసరి సుధ, మాజీ ఎమ్మెల్యే కమలమ్మ

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : మహిళా సాధికారతతోనే సమాజం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ,మాజీ ఎమ్మెల్యే పి.ఎం.కమలమ్మ పేర్కొన్నారు. శనివారం ఎస్టీయు కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో పోరుమామిళ్లలోని ఎస్టీయు భవన్ నందు జిల్లా మహిళా కమిటీ కన్వీనర్ పి.జె.పి. కవిత అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవంను ఘనంగా నిర్వహించడమైనది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సుధ,కమలమ్మలు మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించాలంటే చట్టాలపై మహిళలకు అవగాహన ఉండాలని, చట్టాలను కఠినంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బి.కోడూరు ఎంపీపి చెన్నమ్మ,పోరుమామిళ్ల మాజీ జడ్పీటిసి శారదమ్మ, మాజీ ఎంపిపి ఈశ్వరమ్మ, ఎంపిటిసి పుష్పలత, టేకూరుపేట వైద్యురాలు, వివేకానంద సేవాశ్రమం నిర్వాహకురాలు రామతులసి, ఆగ్నేసమ్మ ఆసరా ఫౌండేషన్ నిర్వాహకులు, అంగన్వాడీ వర్కర్లు, మహిళా పోలీసులు, సీఆర్పీలు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, పంచాయితీ పారిశుధ్య కార్మికులందరినీ శాలువా, పూలమాలలు, బహుమతులతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయు జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ఇలియాస్ భాషా, సంగమేశ్వర రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణారెడ్డి, బాలగంగిరెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి రామమోహన్, రాష్ట్ర సిపియస్ కమిటీ కన్వీనర్ సుబ్రమణ్యం, రాష్ట్రకౌన్సిలర్ చంద్రహాసరెడ్డి, రీజనల్ కన్వీనర్ వి.వి.క్రిష్ణారెడ్డి, కోకన్వీనర్ రమణ, జిల్లామహిళా కమిటీ కోకన్వీనర్ సౌజన్య, సీనియర్ నాయకులు, జిల్లా కార్యవర్గ సభ్యులు కలసపాడు, కాశినాయన, బి.కోడూరు, పోరుమామిళ్ల మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్య సేవ ఉద్యోగులు

విధులు బహిష్కరణ

జిల్లా ప్రెసిడెంట్ సి.విజయ్

విశాలాంధ్ర-కడప : డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులు వారి యొక్క ప్రధాన సమస్యల పరిష్కారాన్ని కొరతూ ఈనెల 10,17,24, మూడు సోమవారాలు రాష్ట్రము మొత్తం విధులు(వైద్య సేవలు) బహిష్కరిస్తున్నామని ఏపీ వైద్య సేవ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా ప్రెసిడెంట్ సి.విజయ్ శనివారం విశాలాంధ్ర తో మాట్లాడుతూ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్టీ ఆర్ వివిఎస్ పథకాన్ని భీమా పరిధిలోకి తీసుకెళ్ళేందుకు రంగం సిద్ధం చేస్తుంది.ఆప్కాస్ రద్దు దిశగా ఇప్పటికే అడుగులేసిన ప్రభుత్వం ఏప్రిల్ నుంచి భీమా సేవలు కొనసాగుతాయని తెలియజేసింది. ఈ పరిణామాలతో రాష్ట్రంలో పనిచేస్తున్న ఎన్టీ ఆర్ వి ఎస్ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రము లో గత 17 సంవత్సరాలుగా రాష్ట్ర ప్రజలకు ఉచిత సేవలందించడంలో కీలకపాత్ర పోషించిన ఫీల్డ్ సిబ్బంది మొత్తం ప్రభుత్వాల నుంచి ఎటువంటి లబ్ధి పొందలేకపోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రభుత్వ లెక్కలలో చూపించి కనీస వేతనాలు అమలు చేయకుండా అరకొర జీతాలతో 17 సంవత్సరాలుగా సరి పెట్టేస్తు న్నారు ప్రభుత్వాలు మారుతున్నాయి పథకం రూపురేఖలు మారు తున్నాయి ప్రతి శాఖలో వేతనాలు మారుతున్నాయి కానీ ఎన్టీ ఆర్ వివిఎస్ ఉద్యోగులు జీవితాలు మాత్రం మారడం లేదు. సీసీ కెమెరాల నిర్వహణతో,విసిగించే యాప్‌లతో, సంబంధం లేని గ్రీవెన్స్ లతో, ఉద్యోగులు పంటి కింద బాధ అనుభవించి ప్రజల సంక్షేమం కోసం చిరునవ్వుతో విధులు నిర్వహిస్తున్నారు కనీస వేతనం, ఉద్యోగ భద్రత లేదు. ఉద్యోగి చనిపోతే సాధారణ వ్యక్తికి ఇచ్చే ఎక్స్ గ్రేషియాతో సరిపెట్టేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు లేవు. ప్రభుత్వ ఉద్యోగాలలో వెయిటేజ్ లేదు. ఇన్ని సమస్యలతో రాష్ట్రంలో రాష్ట్ర ప్రజలకు ఉచిత సేవలు అందించడానికి చిరునవ్వుతో సేవలు అందిస్తున్నారు. కాబట్టి ఈ కార్యక్రమాలతోనైనా ప్రభుత్వాలు తమ గోడుని పట్టించుకోని తమకు న్యాయం చేస్తారని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సమస్యలు నెరవేరని పక్షాన కఠిన తరమైన భవిష్యత్తు పోరాటానికి సిద్ధమని తెలియజేశారు.

జిల్లా ఆసుపత్రిలో మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకొని ప్రొద్దుటూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి నందు ఏపీఎస్ఏసీఎస్ సిబ్బంది, మెడికల్ ఆఫీసర్స్ సూర్య నాగలక్ష్మి, ఫర్జానా మరియే ఏపీఎస్ఏసీఎస్ మహిళా సిబ్బంది మహేశ్వరి, లీలావతి, లేఖలను చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ వారు శాలువాతో సత్కరించారు. అనంతరం సెర్డ్స్ సంస్థ ఆఫీస్ నందు ప్రపంచ మహిళా దినోత్సవం వేడుకలను చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పద్మశాలీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ జింకా విజయలక్ష్మి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆడవారి యొక్క పనితీరును అభినందించారు. ఆడవారు అంటే తక్కువ భావన ఉండకూడదని, మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఝాన్సీ లక్ష్మిభాయి, రాణిరుద్రమ దేవిల ధైర్యంగా ప్రతి సమస్యను అధిరోహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు పసుపు కుంకుమ, తాంబూలం, గాజులు అందించారు.